భైరవి - ఆది

ఎంతపుణ్యమో - యిటు మాకుగలిగె
చెంతనే నీకృప - సిదిద్ధించబోలు

శ్రీపతి మీకథ - చెవులను వింటిమి
పాపములణగెను - భయముడిగె
తీపుగ తులసీ - తీర్థము గొంటిమి
శాపము దీరెను - సఫలంబాయె

గోవింద మిముగను - గొంటిమిప్పుడే
పావనమైతిమి - బ్రతికితిమి
తావుల మీపా - దములకు మ్రొక్కితిమి
వేవేలు గలిగిన - వేడుకలాయె

శ్రీవేంకటేశ్వర - సేవించితి మిము
ధావతి దీరెను - తనిసితిమి
వావిరి ముమ్మారు - వలగొని వచ్చితి
నీవారమైతిమి - నిలిచితి మిపుడు

అన్నమాచార్యుల మనోభావ పరీపాకం, ఆయనకు శ్రీవేంకటేశ్వరుని యెడ గల శ్రద్ధాది భక్తుల వర్ధిష్ణుతావైశద్యం, సరసంగా శరణాగతి చేసిన సరవీ, శ్రీస్వామితో ఆయనకున్న చనవూ ఒండొంటితో ఒరపుజెందినవీ సంకీర్తనలో.

నాకెంత పుణ్యం కలిగిందిస్వామీ; నీదయ నాకిక అత్యంత శ్రీఘ్రంగా సిద్ధిస్తుందేమో.

శ్రీపతీ; నీగుణకథా శ్రవణం చేసిన నా చెవులేమి పుణ్యం చేసుకొన్నవో. నీ గుణగాన శ్రవణంచే నా పాపాలు పటాపంచలై పంచబంగాళమై పారిపోయాయి, భయంతీరింది. 'యశదం శృణుయాన్నిత్యం యశ్చాపి పరికీర్తయేత్ --

నభయం క్వచిదా ప్నోతి అని విష్ణుసహస్ర నామస్తోత్రోత్తర పీఠిక. మధురాతి మధురమైన తులసీతీర్థాన్ని పావనమూ శుభమైన శ్రీవిష్ణు పాదోదకాన్ని పుచ్చుకొన్నందున మనస్తాప శాపంవిముక్తి యైంది. ఈ జన్మ సఫలమైనది.

గోవిందా; నీ దర్శన మహాభాగ్యం సిద్ధించిన క్షణమందే పవిత్రీకృతుల మయ్యాము. బ్రతికాము. నీదర్శనార్థమే మా మనుగడల పరమార్థం, 'జీవేమ శరదశ్శతం నందామ శరదశ్శతం మోదాయ శరదశ్శతం ప్రబ్రవామ శరదశ్శతగ్ం' ఆ పరమార్థసాధనకై శతవ ర్షాలు జీవింతుము గాత; అని యజుర్వేద మంత్రం. సుంగంధ చర్చాన్వితమైన నీ అడుగు దమ్ములకు నమస్కరించాము. సంతోషమై పులకాంకురమైంది. అనవధికమైన ఆహ్లాదం మాకు కలిగినది.

శ్రీవేంకటేశ్వరా; నిన్ను మాశక్తికొలది సేవించాము. మాకోరికలన్నీ తీరి శాంతించి నవి. తృప్తి చెందాము. నీపై త్రికరణశుద్ధమైన వలపుతో వచ్చి, నీవారమయ్యాము. బ్రహ్మా నంద పరమపట్టం నిశ్చలమై మాకు ప్రాప్తించినది. ప్రభూ; ఇదంతా నీవల్లనే అనే అన్నమా చార్యులలోని భక్తుడు, సక్తచిత్తుడూ అయిన యోగీశ్వరుని జ్ఞానవైభవం చిదానందాను భవసారం చెన్నారిన సంకీర్తనా రత్నమిది.